ప్రజాశక్తి

శుక్రవారం 15 నవంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మహా ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వడ్డే శోభనాదీశ్వరరావు

పంట మద్దతు ధరలకు

చట్టబద్ధత కల్పించాల్సిందే..

ఎస్‌కెఎం రాష్ట్ర అధ్యక్షులు వడ్డే శోభనాదీశ్వరరావు

8లో



బాపట్లలో ప్రజా పోరు ధర్నాలో పాల్గొన్న గంగయ్య, సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజల సమస్యలు పరిష్కరించాలని..

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా

4లో

కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే..

ప్రజలపై విద్యుత్ భారాలు

- అప్పుడు స్మార్ట్‌మీటర్లు పగలగొడతామని.. ఇప్పుడు ఇళ్లకూ పెడుతున్నారు..
- ప్రజావ్యతిరేక విధానాలు వీడకుంటే పోరాడతాం..
- 'ప్రజాపోరు' సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కార్పొరేట్ల చేతుల్లోకి విద్యుత్ రంగం వెళ్లి పోయిందని, ఇప్పుడు వారికి దోచి పెట్టేందుకే ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు విడనాడక పోతే ప్రజలతో కలిసి వామపక్షాలు పోరాడతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సిపిఎం ఒంగోలు నగర 13వ మహాసభల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆ పార్టీ 'ప్రజాపోరు' పేరుతో గురువారం ఒంగోలు నగరంలో ప్రదర్శన నిర్వహించింది. మున్సిపల్ కార్యాలయం నుంచి సుందరయ్య భవన్ వరకు ఈ ప్రదర్శన జరిగింది. అక్కడ సభ నిర్వహించారు. సభకు సిపిఎం నగర కార్యదర్శి జి. రమేష్ అధ్యక్షత వహించారు. సభలో వి.శ్రీనివాసరావు ముఖ్యవక్తగా మాట్లాడారు. మంచి ప్రభుత్వం అంటూ ఇళ్లకు స్టిక్కర్లు వేసుకుంటూ ప్రజలపై భారాలు మాత్రం మోపుతున్నారని పేర్కొన్నారు. ఉచిత ఇసుకను ▶ 2లో



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు



మంట ఉచితం..వంట భారం..!



- గ్యాస్ సిలిండర్ ఉచితంగా ఇస్తున్న ప్రభుత్వం
- నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో ఘోర వైఫల్యం
- ఎప్పుడూ లేని విధంగా పెరిగిన ఆయిల్ ధరలు
- ఉల్లి, వెల్లుల్లి, టెంకాయ ధరలు పైపైకి..
- రైతుబజార్లలోనూ విక్రయాలు నిలిపివేత..

ప్రజాశక్తి-మార్కాపురం

ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తూ.. దీపావళి నాడు కూటమి ప్రభుత్వం ఉచిత సిలిండర్ల పథకాన్ని ప్రారంభించింది. కానీ వంట చేసుకొనే నిత్యావసరాల ధరలు నియంత్రించడంతో మాత్రం ఘోరంగా విఫలమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయి. వంట నూనె ధర గత రెండు నెలల్లో రూ.40 వరకు అదనంగా పెరిగింది. 'కూటమి' సహకారంతో ఏర్పాటైన కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడం కూడా దీనికి మరో కారణమని చెప్పొచ్చు. ఉల్లి ధర రూ.80కి ఎగబాకింది. కార్తీకమాసం కావడంతో టెంకాయ ధర కూడా ఎప్పుడూ లేని విధంగా రూ.40కి చేరింది.

బియ్యం, పప్పులు, ఉల్లిగడ్డలు, వంట నూనెలు... ఇలా ఒకటేమిటి అన్ని రకాల వస్తువుల ధరలూ ఆకాశం వైపు చూస్తు న్నాయి. ఏడాది క్రితం ధరలతో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసర ధరలు ఘనసీయంగా పెరగాయి. ఎన్నికల్లో కూటమి నేతలంతా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అస్త్రంగా వాడుకున్నారు. బాదుడే బాదుడంటూ చంద్రబాబుతో సహా టిడిపి కూటమి నేతలంతా ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వాలు ఏర్పడితే ప్రజలపై భారాలు తగ్గిస్తామని ఎన్నికల ప్రచారాల్లో ఊదరగొట్టారు. దీంతో ఎన్‌డిఎ భాగస్వామ్యమైన కూటమి వైపు ప్రజలు మొగ్గు చూపారు. తీరా అధికారంలోకి టిడిపి కూటమి వచ్చింది. కేంద్రంలోనూ కూటమి సహకారంతో బిజెపి అధికారాన్ని నిలబెట్టుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశాయి. ఎన్డీఏ ప్రభుత్వం ఒకేసారి 24 శాతం ఎక్సైజ్ డ్యూటీ పెంచడంతో వంట నూనె ధర గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగింది. రెండు నెలల్లో లీటర్‌కు రూ.40 అదనంగా పెంచేశారు. ప్రస్తుతం పామాయిల్ లీటరు ధర రూ. 136కు చేరింది. ఫ్రీడమ్ ఆయిల్ లీటరు ధర రూ.145కు చేరింది. ఈ ధర కూడా నిలకడగా లేదు. ఇంకా పెరుగుతుందని ▶ 2లో

రైతుబజార్లలో విక్రయాలు నిలిపివేత

ధరల పెరుగుదల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కంటి తుడుపు చర్యగా రైతుబజార్లలో వంట నూనెలు, ఉల్లి ధరలు తక్కువ ధరకే విక్రయించేలా దసరా పండుగకు ముందు ఏర్పాట్లు చేసింది. రెవెన్యూ యంత్రాంగం పర్యవేక్షణలో విక్రయాలు ప్రారంభించింది. వారం రోజులు కూడా ఈ విక్రయాలు సక్రమంగా జరగలేదు. తమకు గిట్టుబాటు కావడం లేదంటూ నూనె వ్యాపారులు రైతుబజార్లకు సరుకు ఇవ్వడం లేదు. దీంతో రైతుబజార్లలో 'తక్కువ ధరకే సరుకుల విక్రయాలు' పూర్తిగా నిలిచిపోయాయి.

పోసానిపై పోలీసులకు ఫిర్యాదు

8లో

అధ్వానంగా 'నెమలిగుండ్ల' రోడ్డు

గుంతలతో వాహనదారుల ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంతలు పడిన రోడ్డు

ప్రజాశక్తి -రాచర్ల

రాచర్ల మండలంలోని నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయాలనికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. గుంతలు పడి ప్రయాణం నరకంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. పలుచోట్ల రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు తిరగడానికి కూడా వీలు లేకుండా చెట్లు పెరిగాయి. ఈ రోడ్డులో పాలకులు, అధికారులు నిత్యం ప్రయాణం చేస్తున్న కూడా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాచర్ల మండలం రాచర్ల నుంచి ఆకవీడు మెయిన్ రోడ్డులో నెమలిగుండ్ల రంగనాయక స్వామి ముఖద్వారం నుంచి జెల్లివారి పుల్లలచెరువు గ్రామం మీదుగా అటవీ ప్రాంతంలో గల నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం వరకు దాదాపు పది కిలోమీటర్ల మేర రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి ప్రయాణం చేయాలంటే ఒళ్ళు హూనమవుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డు గుంతల్లో నీరు నిలుస్తోంది. గుంతల్లో పడి పలు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు రోడ్డుకి ఇరువైపులా ముళ్ళ చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని, మలుపుల దగ్గర ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ రోడ్డు లో ప్రయాణం చేసే జేపీ చెరువు గ్రామ స్తులు నిత్యం ప్రమాదాలకు గురవుతు న్నామని, ప్రాణం గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నామన్నారు. ప్రతి శనివారం నెమలిగుండ్ల రంగనాయక స్వామి దర్శనానికి పలువాహనాల్లో వందలాది మంది భక్తులు ఈ రోడ్లోనే ప్రయాణం సాగిస్తుంటారు. జెపి చెరువు రోడ్డును బాగు చేయాలని అధికారులకు అనేక మార్లు విన్నవించారు. రోడ్డు పనుల కోసం నిధులు మంజూరు అయినా పనులు మొదలు పెడతా అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రయాణికుల అవస్థలను దృష్టిలో పెట్టుకొని వెంటనే రోడ్డు గుంతలు పూడ్చి, ముళ్ళకంప తొలగించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.



కాంట్రాక్టర్లతో సమావేశమైన మేయర్, కమిషనర్

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరిస్తాం

మేయర్, కమిషనర్ హామీ

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరిస్తామని నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వర హామీ ఇచ్చారు. నగరపాలక సంస్థలో పనులు చేస్తున్న కాంట్రాక్టులతో గురువారం వారు సమావేశం నిర్వహించారు. తమకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు మేయర్, కమీషనర్ దష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం మీద మేయర్, కమీషనర్ స్పందిస్తూ వెంటనే బిల్లులు చెల్లించేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇతర సమస్యలు కూడా పరిశీలించాలని అకౌంట్స్, ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజనీర్ చంద్రయ్య, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - బేస్తవారిపేట

మండలంలోని బార్లకుంట గ్రామంలో నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై బేస్తవారిపేట ఎస్ఐ ఎస్‌వి రవీంద్రారెడ్డి గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

కార్పొరేట్లకు దోచిపెట్టేందుకే.. ప్రజలపై విద్యుత్ భారాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలకు ఇస్తామని ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇసుక మాఫియా వచ్చేసి వారి ఇష్టానికి ఇసుకను అమ్ముకునే పరిస్థితి ప్రతిచోటా ఉందన్నారు. ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించమని అడుగుతుంటే ప్రభుత్వం మాత్రం మద్యం ధరలు తగ్గించామని చెబుతుందని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే పని రాష్ట్రప్రభుత్వం చేయడం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. రాజకీయ నిరుద్యోగులకు మాత్రం నామినేటెడ్ పదవులు ఇచ్చి భర్తీ చేసుకున్నారని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని తగ్గించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ నెల రోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంట నూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. పండుగల సందర్భంగానూ, రోజువారీ సరుకుల కొనుగోళ్ళలోను ధరల ప్రభావం కనిపిస్తోందని వివరించారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతోందని తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ నగరంలో తాగునీరు, ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ప్రజలకు అప్పగించాలని, వివిధ చోట్ల నివాసం ఉంటున్న ప్రజలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.400 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు మరో రూ.500 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, నగర నాయకులు దామా శ్రీనివాసులు, జి.ఆదిలక్ష్మి, తంబి శ్రీనివాసులు, ఎస్‌డి.హుస్సేన్, తంగిరాల మహేష్, దారా వెంకటేశ్వర్లు, బీవీ.రావు, కొర్నెపాటి శ్రీనివాసులు, యం.డి.యాసిన్, శ్యామ్, హరికృష్ణ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

బాలల హక్కులపై అవగాహన అవసరం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

బాలల హక్కుల పరిరక్షణకు సంబంధిత చట్టాలపై అధికారులందరికీ సమగ్ర అవగాహన అవసరమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. జిల్లాలో ప్రత్యేకంగా "బంగారు బాల్యం" కార్యక్రమాన్ని అమలు చేస్తుండటంతో బాలలకు సంబంధించిన చట్టాలపై జిల్లా స్థాయి అధికారులకు గురువారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని ఆమె ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, వాటిని పొందేందుకు కావాల్సిన అర్హతలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగానే తొలుత అధికార యంత్రాంగానికి ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. న్యాయ, కార్మిక, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షా చట్టం, ఫోక్సో, విద్యా హక్కు చట్టాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.రవిశంకర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.వి.రాఘవులు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.చినఓబులేసు, ఐసిడిఎస్ పీడీ కె.మాధురి, జిల్లా ఉప విద్యాధికారి సామా సుబ్బారావు, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న, పార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆర్.సునీల్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మంట' ఉచితం..'వంట' భారం.!

(మొదటిపేజీ తరువాయి)

వ్యాపారులు అంటున్నారు. ఆరుదల ఉల్లిగడ్డలు కిలో రూ.80కి చేరువలో ఉంది. తెల్లగడ్డలు కిలో రూ.400, మేలు రకం బియ్యం 25 కిలోల బ్యాగు రూ.1800 వరకు ఉంది. పప్పు దినుసులన్నీ గతంలో ఉన్న ధరల కంటే కిలోకు రూ.10 నుంచి రూ.20కి పెరిగాయి. బెల్లం ధర కూడా చేదెక్కింది. కిలో రూ.55 దాటింది. గతంలో ఒక్కసారిగా నిత్యావసర ధరలు ఈ విధంగా పెరిగిన సందర్భాలు లేవు. పెరిగిన ధరలతో ఒక్కో సామాన్య కుటుంబంపై నెలకు రూ.వెయ్యికి పైగా అదనపు ఖర్చు పెరిగింది. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారని సామాన్యులు విమర్శిస్తున్నారు. ఓ వైపు నిత్యావసరాల ధరలు పెంచి.. మరో వైపు వంట గ్యాస్‌ను ఉచితంగా ఇచ్చి ఏం లాభమని పెదవి విరుస్తున్నారు.

కార్తీక మాసంలో ధరల భారం

ప్రస్తుతం కార్తీక మాసం నడుస్తోంది. మహిళలు ఎక్కువగా పూజా కార్యక్రమాల్లో గుళ్లు, గోపురాల చుట్టూ తిరుగుతుంటారు. పూజలో ముఖ్యమైంది కొబ్బరికాయ. దాని తరువాత నువ్వుల నూనె కార్తీక దీపం వెలిగించేందుకు వినియోగిస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొబ్బరికాయ ధర రూ.40కి చేరింది. గతంలో రూ.100కి వచ్చే నువ్వుల నూనె లీటరు బాటిల్ ఇప్పుడు రూ.140కి చేరింది. కనీసం కార్తీక దీపం వెలిగించాలన్నా, కొబ్బరికాయ కొట్టాలన్నా.. పేదలు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిపిడిపి మరియు బిపిడిపి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక ప్రణాళికలు తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు, అధికారులు, విఒ అధ్యక్షులు, కోర్స్ డైరెక్టర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయమణి, ఇఒఆర్‌డి టి.సుధాకర్, పరిపాలన అధికారి జివి.కష్టారావు, టిఒటిలు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామీణాభివృద్ధి రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్లు రామనాథం పేర్కొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గ్రామీణాభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, వివిధ శాఖల అధికారులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధులను బట్టి ప్రాధాన్యత క్రమంలో సర్పంచులు, అధికారులు, ప్రజల సమన్వయంతో వ్యవహరించి ప్రణాళికలు సిద్ధం చేసుకొని గ్రామాల అభివృద్ధి శ్రీకారం చుట్టాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా బంగారు బాల్యంతోనే మహోన్నత ప్రపంచం సాధమవుతుందని మనస్ఫూర్తిగా నమ్ముతూ అందుకు తమవంతు కషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో బాపట్ల విస్తరణ శిక్షణాధికారి డి. వెంకటేశ్వర్లు, ఎంపిపి నలమలపు అంజమ్మ, ఎంపిడిఒ వై.మహలక్ష్మి, సర్పంచులు, కార్యదర్శులు అంగన్ వాడీ సూపర్ వైజర్లు , పశువైద్యాధి కారులు పాల్గొన్నారు.



శింగరాయకొండలో మాట్లాడుతున్న ఎంపిడిఒ జయమణి

పొన్నలూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సుజాత అధ్యక్షతన గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళికల తయారీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడానికి అవసరమైన పద్ధతులు,అనుసరించవలసిన విధానాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, డిజిటల్ అసిస్టెంట్లు, టిఒటిలు నారాయణ,నితిన్, ఇఒపిఆర్‌డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపి : గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిరంజీవి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి పంచాయతీలను అభివృద్ధి ఎలా చేయాలి, నిధులు ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై వివరించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ రామాంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జరుగుమల్లి మండలం పచ్చవ గ్రామంలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పచ్చవ గ్రామానికి చెందిన తానికొండ రమణయ్య(50) పశువులను మేత కోసం పొలం తోలుకెళ్లాడు. అదే సమయంలో పాము కాటు వేసింది. దీంతో రమణయ్యను కొండపి వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు, జరుగుమల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పరీక్షలు చేయించుకుంటున్న డాక్టర్ సురేష్ కుమార్

కేన్సర్ రోగులను గుర్తించాలి

ప్రజాశక్తి- మద్దిపాడు

కేన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని మల్లవరం, ఏడుగుండ్లపాడు హెల్త్ వెల్నెస్ సెంటర్లను ఢిల్లీకి చెందిన డబ్ల్యుహెచ్ఒ వైద్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ వరల్డ్ డయాబెటిస్ కంట్రోల్‌డే సందర్భంగా హెల్త్ వెల్నెస్ సెంటర్లను సందర్శించినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది పక్కాగా సర్వే చేసి కేన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగిన వైద్యం అందే విధంగా చూడాలన్నారు. కేన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. అనంతరం గహాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పరీక్ష విధానాన్ని తెలుసుకుని సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ భగీరథి, సర్పంచి శిల్పా సౌందర్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనందమోహన్, సిహెచ్ఒలు లలితమ్మ, రవితమ్మ, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఎఎన్ఎం అనురాధ, ఎంఎల్‌హెచ్‌పిఅఖిల తదితరులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - మద్దిపాడు

హౌస్ ఓల్డ్ జియో సర్వేను వేగంగా చేపట్టాలని ఎంపిడిఒ జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జ్యోతి మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి సర్వే చేయాలన్నారు. అనంతరం ఎన్ పిసిఐపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం హాజరుపట్టి, మూమెంట్ రిజిస్టర్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయ ఆదాయం

రూ.11,15,000

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని వల్లూరమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు , రవికలు పోగు చేసుకొను హక్కు కోసం గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాట ద్వారా ఆలయాన్ని రూ.11,15,000 ఆదాయంగా వచ్చింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి బి.రమేష్, జూనియర్ సహాయకులు కె. మోహన్‌రావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న దాత

కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని ఆర్ఎల్‌పురం అంగన్‌వాడీ కేంద్రానికి యువ నాయకుడు పమిడి సురేష్ కుర్చీలు, ఫ్యాన్లు గురువారం బహూకరించారు.బాలల దినోత్సవ సందర్భంగా సురేష్ తండ్రి రంగయ్య కుర్చీలు, ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రంగయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెమిని శ్రీను, ఇజ్జగిరి విజయకుమార్, అంగన్‌వాడీలు మాదాల రాధ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-కొండపి

ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలలో పరిమితికి మించి కూలీలను ఎక్కిరాదని కొండపి సిఐ సోమశేఖర్ తెలిపారు. వాహనాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు విర్దుంగా ప్రయాణికులను ఎక్కించిన వాహనాల డ్రైవర్లను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్, సూచనలు, సలహాలు ఇచ్చారు. పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తే డ్రైవర్లు, వాహన యాజమానులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వాహన చోదకులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలన్నారు.. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి-టంగుటూరు

కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేర టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రం వద్ద స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల మొక్కలు నాటారు. రైతులకు నీడనిచ్చే టేకు, మారేడు, నేరేడు, ఉసిరి, ఇతర కలప జాతి మొక్కలు పంపిణీ చేశారు. వేలం కేంద్రంలోని నీటి తొట్లను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు భరతమాత, టంగుటూరి ప్రకాశం పంతులు, గాంధీజీ, పొట్టి శ్రీరాములు చిత్రపటాలను గ్రంథ పాలకుడు అజయ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ సాయి కిషోర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేతాజీ ట్రూప్ లీడర్ మరియు జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకట శేషారావు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : మండలపరిధిలోని ఉప్పుగుండూరు, నాగులుప్పల పాడు శాఖా గ్రంథాలయాల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు తొలుత నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడు జిల్లాపరిషత్ హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎన్. అంజిరెడ్డి బాలల దినోత్సవ ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం విద్యార్థు లకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నాగులుప్పలపాడు గ్రంథపాలకుడు యం.శ్రీనివాసులు తదిరులు పాల్గొన్నారు.

టంగుటూరు : టంగుటూరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్. కల్పన, టి.భారతి, ఎస్‌కె.ఖాదర్ బాషా, కె.లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'బంగారు బాల్యం'

ప్రజాశక్తి-కొండపి

బాలల ఆరోగ్య సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపిడిఒ రామాంజనేయులు తెలిపారు. స్థానిక సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో బంగారు బాల్యం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం బాల బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మురళి ,ఎంఇఒ సురేఖ , సిడిపిఒ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఎస్ఐ ప్రేమ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని కె.ఉప్పలపాడు హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు వి.సుసన్న కుమార్, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

శింగరాయకొండ : శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ విద్యానికేతన్ హైస్కూల్‌లో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 ఆవుల


కొండపిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులు చిన్న తనం నుంచే క్రమశిక్షణతో చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

శింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలతో బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ చేయించినారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రవి, ఎంపిడిఒ జయమణి, మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసులు, హరిరామ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా, అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, సాంత్వన సంస్థ డైరెక్టర్ రావినూతల జయకుమార్ పాల్గొన్నారు.



కొల్లూరు తహశీల్దారుకు సమ్మె నోటీస్ ఇస్తున్న దృశ్యం

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - అద్దంకి

తహశీల్దారు, ఎంపిడిఒను 108 సిబ్బంది కలిసి సమ్మె గురువారం నోటీసు అందచేశారు. ఎన్నో ఏళ్ల నుండి 108 సర్వీసులో పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. 108ను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. 8గంటల పనివిధానం అమలు చేయాలని, పిఎఫ్ రెండు వాటాలు గతంలో ఉద్యోగుల జీతంలో కట్ చేసేవారని, అలా జరగకుండా న్యాయం చేయాలని కోరారు. ఎవరన్నా ఉద్యోగి చనిపోతే రూ.20లక్షల భీమా కల్పించాలని, రద్దు చేసిన పాత జిఒ నెంబరు 49ని పునరుద్ధరించాలని నోటీసులో పేర్కొన్నారు కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి హరిబాబు పాల్గొన్నారు.
సంతమాగులూరు : 108 వాహన సిబ్బంది సమ్మె నోటీసు తహశీల్దారు కె రవి బాబు, ఎంపిడిఒ జ్యోతిర్మయికి అందజేశారు. అనంతరం సిబ్బంది మాట్లాడారు. ఈనెల 11న 108 వాహన రాష్ట్ర కమిటీ ఉద్యోగుల సమస్యలు తీర్చమని విజయవాడలోని అరబిందో నిర్వహణ సంస్థ, ప్రభుత్వ లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందించినట్లు తెలిపారు.
కొల్లూరు : దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారుకు 108సిబ్బంది సమ్మె నోటీసు ఎంపిడిఒ నరసింహారావు, తహశీల్దారు వెంకటేశ్వర్లకు అంబులెన్స్ సిబ్బంది సమ్మె నోటీసు అందజేశారు.



పోటీలకు హాజరైన వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక బిబిహెచ్ కాలేజీ నందు కొలహలంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు గురువారం జరిగాయి. ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి సంబంధించిన ఇంటర్ కాలేజియేట్ ఛాంపియన్షిప్ సెలెక్షన్స్‌లో భాగంగా వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ విమెన్ విభాగలో పోటీలు నిర్వహించారు. 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6 మంది విద్యార్థులు ఎన్‌వి మహేష్, ఎం తిరుపతిరావు, బి ఆదిత్య, జి మధు, టి వంశివల్లభ, టి పవన్ ప్రసన్నను, 27, 28 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగు సౌత్ జోన్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జి అది లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ పరిశీలకులు డిప్యూటీ డైరెక్టర్ ఐ దేవివరప్రసాద్, జి సాయి సురేష్, ఎం శేషగిరి పాల్గొన్నారు.

నాణ్యమైన చికిత్స అందించాలి

ప్రజాశక్తి - మెదరమెట్ల

హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులకు వైద్యశాలల్లో మెరుగైన చికిత్స అందించి ఆ రోగులకు తగిన ధైర్యం కల్పిస్తూ హెచ్ఐవి బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఆర్ రాజ్యలక్ష్మి అన్నారు. హెల్ప్ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హెల్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ మాట్లాడుతూ ప్రజలకు హెచ్ఐవి ఎలా వస్తుందో తెలియక దాని బారిన పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సాదినేని ప్రసన్నకుమారి, జడ్పిటిసి టి వెంకటరమణ, ఎఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ తీరు మారలేదు: జనసేన

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజలు గత ఎన్నికల్లో తిరస్కరించినప్పటికీ వైసిపి నేతల తీరు మారలేదని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఈపూరి సురేష్, మలిశెట్టి సాయి, పేరంశెట్టి వాసు, అల్లంశెట్టి గోవర్ధన్, భూపతి కోటి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలని

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా



అద్దంకి కార్యాలయం వద్ద సిపిఎం నాయకుల ధర్నా



చీరాల తహశీల్దారు గోపికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వాలు మారినా ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఏమాత్రం మార్పు రాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజా పోరులో భాగంగా గురువారం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక వైద్య కళాశాలను రూ.700కోట్లతో గత ప్రభుత్వం నిర్మాణం చేపడితే నేటి కూటమి ప్రభుత్వం దాని ఊసే లేకుండా చేస్తోందని అన్నారు. మెడికల్ కాలేజీ పనులు వెంటనే చేపట్టాలని అన్నారు. ఉప్పరపాలెం రైల్వే గేటు వద్ద గంటల తరబడి ప్రజలు వేచి ఉండాల్సి వస్తుందని, వాహనదారుల విలువైన సమయం వృధా అవుతుందని అన్నారు. గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణం చేయాలని కోరారు. ప్రధానంగా పట్టణంలో డ్రైనేజీ సమస్యతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. దోమలు నిర్మూలనకు తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని అన్నారు. నివేశన స్థలాలు లేని అర్హులైన పేదలకు వెంటనే స్థలాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య, కె శరత్, భాస్కరరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.
కారంచేడు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ప్రజాపోరు ధర్నా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పి కొండయ్య మాట్లాడారు. డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి ఏడుకొండలు, సుబ్బారావు, చింతపల్లి హనుమంతరావు, యేసయ్య, నారపరెడ్డి పాల్గొన్నారు.
రేపల్లె : ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహశీల్దారు మోర్ల శ్రీనివాసుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ మణిలాల్ మాట్లాడారు. ఇసుక ధరలు తగ్గిస్తామని ప్రకటనలు ఇచ్చి పూర్తిస్థాయిలో తగ్గించలేదని అన్నారు. మద్యం ధరలు తగ్గించామని, నాణ్యమైన మద్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్, ఇసుక వంటి ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాలు నేతలు కె ఆశీర్వాదం, కెవి లక్ష్మణరావు, బి ఆగస్టిన్, జి దానియేలు, కె నాంచారమ్మ, కె రమేష్ పాల్గొన్నారు.
చీరాల : విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, అధిక ధరలు అరికట్టాలని, ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని, పట్టణంలో పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు మాట్లాడారు. పట్టణంలో అర్హులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని, రీచ్‌లను గుర్తించి ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం వసంతరావు, ఎల్ జయరాజు, డి నారపరెడ్డి, ఐవీ ప్రసాద్, బి సుబ్బారావు, బహుజన రాజ్యం నాయకులు ఎస్‌కె జిలానీ, శేషయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
అద్దంకి : ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం ప్రజాపోరులో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, రావులపల్లి కోటేశ్వరరావు, కె ప్రమీల, కె హనుమంతరావు పాల్గొన్నారు.
మేదరమెట్ల : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, విద్యుత్ ఛార్జీలను పెంచరాదని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దారు జివి సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎం ఆంజనేయులు, వై రవీంద్రబాబు, లక్ష్మణరావు, కంచర్ల రమేష్ బాబు, శ్రీను వైకుంఠం, అన్నపూర్ణ, జయమ్మ, ప్రేమీల పాల్గొన్నారు.
పర్చూరు : గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడగించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. దీనిద్వారా అనేక గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని అన్నారు. సిపిఎం ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా పోరులో భాగంగా తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కౌలు రైతులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఓడరేవు, పిడుగురాళ్ల రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులందరికీ 2013 చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం డేవిడ్, బి చిన్నదాసు, సిహెచ్ ఆనందరావు పాల్గొన్నారు.
మార్టూరు రూరల్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు, రైతు సంఘం నాయకులు కందిమళ్ళ రామ కోటేశ్వరరావు కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెవిన్యూ రికార్డులతో పని లేకుండా రైతులకు సకాలంలో రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు ప్రశాంతికి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎనికపాటి రాంబాబు, బోడెంపూడి సూరిబాబు, వి కృష్ణమూర్తి, మొగల్ ఇబ్రహీం, షేక్ అబ్దుల్ గఫూర్, షేక్ షరీఫ్, గన్నవరపు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



తహశీల్దారుకు అర్జీ ఇస్తున్న మేదరమెట్ల సిపిఎం నాయకులు



పర్చూరులో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు



రేపల్లెలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

రక్షిత భవనాలకు కొత్త హంగులు

ప్రజాశక్తి - బాపట్ల

తీర ప్రాంతంలో తుపాను రక్షిత భవనాలకు సరికొత్త హంగులు సమకూర్చేందుకు యూనిసెప్ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తుందని యూనిసెఫ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మహేంద్ర తెలిపారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగరాజు స్థానిక అధికారులతో కలిసి సూర్యలంకలోని తుఫాను రక్షిత భవనాన్ని పరిశీలించారు. తీరంలో తుఫాను రక్షిత భవనాలను మరింత మెరుగుపరిచేందుకు ఎంత వ్యయమైనా భరించేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో తుపాను షెల్టర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. 1977పెను తుపాను తర్వాత వీటి అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం అప్పట్లో అనేక తీర ప్రాంత గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారని అన్నారు. తుఫాను షెల్టర్ల అభివృద్ధి విషయంలో అనాదిగా నిర్లక్ష్యం వెంటాడుతూనే ఉందని అన్నారు. తాజా పరిస్థితుల్లో తుఫాను షెల్టర్ల ప్రాధాన్యత అధికంగా కనిపిస్తోందని తెలిపారు. వీటిపై ప్రభుత్వం సమర్థవంతమైన నివేదిక సిద్ధం చేసిందని తెలిపారు. 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మల్టీపర్పస్ సైక్లోన్ షెల్టర్ అభివృద్ధికి రూ.5లక్షలు కార్పస్ ఫండ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు జరగలేదని తెలిపారు. తుపాను షెల్టర్లో ఉన్నామన్న భావన కలగకుండా ఒక మంచి ప్రదేశంలో గడిపామన్న ఉత్సాహాన్ని నింపేలా ఈ కేంద్రాలు రూపుదిద్దుకునే దిశగా యూనిసెఫ్ కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. అందులో తొలి ప్రయత్నంగా సూర్యలంక కేంద్రాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. తుఫాను సమయాల్లో ప్రజలకు రక్షణ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట తహశీల్దారు సలీమా, ఎంపిడిఒ బాబురావు, డిఎల్పిఒ పులి శరత్ బాబు, డిఆర్డిఎ పిడి పద్మ పాల్గొన్నారు.



తుఫాను రక్షిత భవనంలో వైర్ లెస్ సిస్టం పరిశీలిస్తున్న మహేంద్ర



వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ఆశా కార్యకర్తల వినతి

ప్రజాశక్తి - బాపట్ల

ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి గురువారం అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు 2024 ఫిబ్రవరిలో జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీఓలు సర్క్యులర్ వెంటనే విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. 9 నెలలు కావస్తున్న జిఒ విడుదల కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మంది మరణించారని అన్నారు. వీరికి భీమా సౌకర్యం వర్తించలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కెశరత్, ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎం వెంకటేశ్వరమ్మ, యూనియన్ కోశాధికారి యు వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
శుక్రవారం 15 నవంబర్ 2024

సిపిఎం కృషి ఫలితంగానే..

ప్రజా సమస్యలకు పరిష్కారం

సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

సిపిఎం కృషి ఫలితంగా అనేక ప్రజా సమస్యలు పరిష్కారమైనట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. సిఎస్‌పురంలో సిపిఎం మండల ఆరవ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేసిన కృషి ఫలితంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం అయినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు గ్యాస్, పెట్రోల్, విద్యుత్ ఛార్జీలు పెరిగినట్లు తెలిపారు. ఉద్యమాలు చేసి ప్రభుత్వాలపై వత్తిడి తీసుకు వస్తే తప్ప ఈ సమస్యలు పరిష్కారం కావన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

15 న ధర్నా ను జయప్రదం చేయాలి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి పిలుపు నిచ్చారు. సిపిఎం మండల ఆరవ మహాసభలో మండల కార్యదర్శిగా ఊసా రాజ్యలక్ష్మిని ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలో అనేక గ్రామాలలో కరపత్రాల పంపిణీ, ప్రచారం చేసినట్లు చెప్పారు. సన్నపురెడ్డి తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రమేష్, సిఎస్ పురం, పామూరు మండల కార్యదర్శులు ఊసా రాజ్యలక్ష్మి, కె,మాల్యాద్రి, నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, ఎం.రత్నారెడ్డి, బి. జేసురత్నం, డోలా తిరుపతయ్య, అంకెపల్లి వెంకటేశ్వర రెడ్డి, పి.నరసింహులు, కొండా కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా ఊసా రాజ్యలక్ష్మి

సిపిఎం మండల 6వ మహాసభలో మండల నూతన



కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఊసా రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులుగా ఊసా వెంకటేశ్వర్లు, మారంరెడ్డి రత్నారెడ్డి, బక్క జేసురత్నం, డోలా తిరుపతయ్య, అంకెపల్లె వెంకటేశ్వరరెడ్డి, పొదిలి నరసింహులును ఎన్నుకున్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కొండపి

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం మండల కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని కోరుతూ తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు రవికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కెజి.మస్తాన్, సిపిఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయకత్వాన ప్రజలపై అదనపు భారాలు వేస్తూ వారిని పీల్చి పిప్పి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాటికే నిత్యావసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగినట్లు తెలిపారు. ట్రూ అఫ్‌ఛార్జీల పేరుతో ప్రజలపై సుమారు రూ.18 వేల కోట్ల అదనపు భారం మోపుతున్నట్లు తెలిపారు స్మార్ట్ మీటర్ల వల్ల రైతులు,



డ్యిపూటీ తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వ్యాపారులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. వ్యవసాయం చేయలేక రైతులు ఆత్మహత్యలకు దారి తీస్తుందన్నారు. ఇప్పటికే పంటలకు గిట్టుబాటు ధర లేక ఎరువులు. పురుగుమందులు పెరగడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే అదనపు విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక రైతులు వ్యవసాయానికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో మద్యం ఏరులై పాతుందన్నారు. గ్రామగ్రామాన బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. మహిళలు, చిన్నారులపై రోజురోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగసంస్థల్లోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రేవేటీకరణ, ఉద్యోగులు తొలగింపును విరమించుకోవాలన్నారు. మహిళలు మైనార్టీలు, దళితులపై దాడులు , అత్యాచారాలు అరికట్టాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజి ఇచ్చిన ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. జమిలి ఎన్నికలు వద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి వరకూ 14 ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరిం చాలని నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య ప్రజలపై అధికభారం పడుతుందన్నారు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువత నిరాశకు గురవుతున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి రూ.6,072 కోట్ల అధికభారాలు వేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు స్మార్ట్ మీటర్లను పెట్టేందుకు సిద్ధమైందన్నారు రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై రోజురోజుకు అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగి పోతున్నాయన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదన్నారు. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులు, రవాణా, వాహన యజమానులు, కార్మికులు, భవన నిర్మాణ దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం షాపులు విచ్చల విడిగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ గ్రామాన బెల్టు షాపులకు ఏర్పడినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు జి. బసవపున్నయ్య, ప్రభుదాస్, యు.వెంకటేశ్వర్లు, నాగేశ్వర రావు, రామాంజనేయులు, చిరంజీవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న టి. శ్రీకాంత్

టంగుటూరు : సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని ఈనెల 8 నుంచి 14 వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారు కార్యాయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం టంగుటూరు ఏరియా కమిటీ కన్వీనర్ టి. రాము మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటం లోనూ ప్రభుత్వాలు పూర్తిగా విఫల మయ్యాయని ఆరోపించారు. వెలిగొండ, సంగమేశ్వరం ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. టంగుటూరు రైల్వే గేట్‌పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. పొందూరు, కొణిజేడు గ్రామాల మధ్య ఉన్న ఇనగలేరు పై వంతెన కట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి. మోజెస్, టి. వెంకటరావు, ఎస్‌కె. మీరాస్ , టి.సుబ్బారావు, ఎం. యానాది, టి. పాపారావు, ఎం.కోటయ్య, ఎల్. కొండయ్య, శ్రీను పాల్గొన్నారు.



టంగుటూరులో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ



స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మండల పరిధిలోని పాకల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివిఎస్. ప్రసాద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్–17 బాల బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అన్నమయ్య జిల్లా రాయచోటీలో ఇటీవల నిర్వహించారు. ఆ పోటీలలో పాకల విద్యార్థిని కె.సిపోరా పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి.హజరత్తయ్య తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్‌లో ఈ నెల 16 నుంచి 20 వరకూ నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీలలో సింపోరా ఆంధ్ర ప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా సిపోరాను ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు హజరత్తయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఖాదర్ బాషా

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు భాష్యం స్కూల్ విద్యార్థులు ఘట్కా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్‌కె.ఖాదర్ బాషా తెలిపారు. ఈనెల 9 నుంచి 10వ వరకూ రేణిగుంటలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఘట్కా పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆయన తెలిపారు. అండర్–19 విభాగం ఘట్కా పోటీల్లో మేకల ధరణి ప్రియ, ఎస్‌కె. రేహ్నాభాను , ఎస్‌కె. నౌషాద్ బేగం ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు మేకల ధరణి ప్రియ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ధరణి ప్రియ, ఘట్కా పోటీల్లో ప్రతిభ చూపిన నౌషాద్ బేగంను భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకష్ణ, ప్రకాశం జోన్ జెడ్ఇఒ శ్రీకష్ణ గణేష్, ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, కోచ్ యోహోషువ తదితరులు అభినందించారు.



పెన్నులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రమణారెడ్డి. అర్పణషాపర్

ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- ఒంగోలు

బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక సంతపేటలోని వివిఎస్ ఒఎంసి ప్రైమరీ స్కూల్‌లో మోడరన్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పెన్సిల్, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మారం వెంకట రమణారెడ్డి, డాక్టర్ అర్పణ షాఫర్ మాట్లాడుతూ కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జెవి. కృష్ణవేణి, ఎం. బాలరాజు, హాస్పిటల్ సిబ్బంది ఎస్‌కె.నరేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పుస్తకాలు గొప్ప విజ్ఞానాన్ని ఇస్తాయని, పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఆమెతోపాటు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తకాలు గొప్ప జ్ఞానాన్ని ప్రసాదిస్తాయన్నారు. గ్రంథాలయంలో సుమారు 6లక్షల పైగా పుస్తకాలు అందుబాటులో వున్నాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ మంచి పుస్తకం మంచి స్నేహితుడుతో సమానమన్నారు. విశ్రాంత ఉప కలెక్టర్ పేరయ్య, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు లక్ష్మా నాయక్ మాట్లాడుతూ పుస్తకాలను చదవడం ద్వారా మంచి చెడుల విచక్షణ తెలుస్తుందన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 20వరకు రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వారం రోజుల పాటు ఘనంగా జరుపుకో నున్నట్లు తెలిపారు. కలెక్టర్ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు.


పుస్తకాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

సమైక్య నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పంగులూరు

మండల సమైక్య పాలకవర్గ సభ్యులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్లో జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షురాలు జనకవరంకు చెందిన ఏజెండ్ల మాధవి, ఉపాధ్యక్షులు కందిమల్ల శైలజ (చందలూరు), కార్యదర్శిగా వజ్రాల కమలాదేవి (బూదవాడ), సహాయ కార్యదర్శిగా ఎర్రం పద్మావతి (కల్లంవారి పాలెం), కోశాధికారి కర్రీ భారతీ (పంగులూరు) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డిపిఎంయు నుండి ఎపిఎం ఎల్ఎంఎం రమేష్ బాబు మాట్లాడుతూ ఈ ఎన్నిక ప్రక్రియ ప్రతి ఏటా ఆడిట్ పూర్తయిన తర్వాత జరుగుతుందని, ఇప్పుడు కూడా ఆడిట్ పూర్తి చేసుకొని ఎన్నికలు జరిపామని చెప్పారు. ఎంపికైన పాలకవర్గ సభ్యులు ఈరోజు నుండి ఏడాది కాలం పాటు పదవిలో కొనసాగుతారని చెప్పారు. పాలకవర్గం ఎలాంటి పక్షపాతాలకు లోను కాకుండా, నిజాయితీగా, నిబద్ధతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం జ్యోతి ప్రసాద్, అద్దంకి క్లస్టర్ లీగల్ కో ఆర్డినేటర్ కె విజయభాస్కర్, సిసిలు సిహెచ్ సాల్మన్, సురేష్, చంద్ర పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన మండల సమైక్య కార్యవర్గం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సమగ్ర, సుస్థిరాభివృద్ధికి పాటుపడే విధంగా నిబంధనలు పాటించి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీపీ డివి లలిత కుమారి అన్నారు. శిక్షణలో భాగంగా 2వ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామసభ వివరాలను నార్పె యాప్ నందు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, ఎ చిన వెంకటేష్ బాబు, లీలా ప్రసాద్, ఈఓ పిఆర్డి టి ఉషారాణి, ఎపిఎం జి శ్రీమన్నారాయణ, పిఆర్ ఏఈ రామచంద్రరావు, ఏఈ ఆర్ డబ్ల్యుఎస్ శివకృష్ణ, ఏపీఓ శివపార్వతి, అంగన్వాడి సూపర్వైజర్లు ఫజీరున్నిస, వెంకటరమణ పాల్గొన్నారు.

నగరం : ప్రజా ప్రణాళిక ద్వారా గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఎంపిడిఒ బి శ్రీనివాసరావు అన్నారు. జిపిడిపి శిక్షణలో ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనపై శిక్షణ నిర్వహించారు. 2030కి సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో టిటిపిలు వై రాంబాబు, ఎం జోగేంద్ర పాల్గొన్నారు.

నిజాంపట్నం : ఎంపిడి కార్యాలయ సమావేశ హాల్లో ఎంపిడిఒ నర్రా నాగలక్ష్మి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు, విఒ, డిఏలు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్డి రవిశంకర్ పాల్గొన్నారు.

పర్చూరు : గ్రామాల అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడంలో అలసత్వం వద్దని ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. ఎంఆర్సి సమావేశ హాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు.

కార్తీక పౌర్ణమికి ముస్తాబైన సూర్యలంక బీచ్

ప్రజాశక్తి - బాపట్ల

కార్తీక పౌర్ణమికి సూర్యలంక బీచ్ ముస్తాబైంది. కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలకు విచ్చేసే పర్యాటకులకు బీచ్లో సకల సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బీచ్లో ఉన్న మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉచితంగానే పర్యాటకులు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. సముద్ర స్నానాల అనంతరం మంచినీటితో జల్లు స్నానం ఆచరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సూర్యలంక బీచ్లో ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆర్డిఓ పి గ్లోరియా సూర్యలంక బీచ్ని గురువారం అధికారులతో కలిసి సందర్శించారు. రెండు లక్షల పైగా పర్యాటకులు వస్తారని అంచనా వేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అత్యంత పరిశుభ్రతమైన బీచ్గా పేరున్న సూర్యలంక బీచ్ మరింత శుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. బీచ్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని అన్నారు. అంబులెన్స్ను ఏర్పాటు చేశామన్నారు. పర్యాటకులకు త్రాగునీటి కొరత లేకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని అన్నారు. బీచ్కు విచ్చేసే తల్లులు సముద్ర స్నానాలు ఆచరించే సమయాల్లో పిల్లలను సంరక్షించేందుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు అంగన్వాడీలతో బీచ్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. జలు స్నానాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యంతో పాటు ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఏర్పాట్లు చేశామని అన్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో తహశీల్దారు సలీమా, ఎంపిడిఒ బాబురావు, ఈఒపిఆర్డి పులి శరత్ బాబు పాల్గొన్నారు.


ఢిల్లీలో సిద్దా వెంకట సుబ్బారావును సన్మానిస్తున్న దృశ్యం

సిద్దుకు 'ఉత్తమ దారుశిల్పి' అవార్డు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన సిద్దు వెంకట సుబ్బారావు కు 'ఉత్తమ దారుశిల్పి' అవార్డును గురువారం ఢిల్లీలో అందజేశారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో దేశంలోని 12 రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ఘనంగా సత్కరించారు. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుండి ఎంపికైన ఒకే ఒక్క వ్యక్తి ముప్పవరం గ్రామానికి చెందిన సిద్దు వెంకట సుబ్బారావు కావటం గమనార్హం. అవార్డును తెలంగాణ శాసన సభ మాజీ స్పీకర్ మధుసూదనా చారి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, తల్లోజ్ ఆచారి చేతుల మీదుగా అందజేశారు. 30ఏళ్ల క్రితం ఒకే చెక్కలో సరస్వతీ పీఠం తన ప్రతిభతో అద్భుతంగా సృష్టించాడు. ఈ సందర్భంగా సిద్ది వెంకట సుబ్బారావును మండలంలోని విశ్వబ్రాహ్మణులంతా అభినందిస్తున్నారు.


బహుమతి అందజేస్తున్న శ్రీచైతన్య ఎజిఎం అంజయ్య

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యార్థులు చదువు తోపాటు అన్ని రంగాల్లో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని శ్రీ చైతన్య పాఠశాల ఎజిఎం నూతలపాటి అంజయ్య తెలిపారు. ప్రిన్సిపల్ కె సంపత్ కుమార్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ జి అప్పాజీ, కో ఆర్డినేటర్ కె శ్రీనివాసరావు, ఎఒ శేషగిరిరావు, డీన్ రాఘవ, ఇన్చార్జిలు రాజ్యలక్ష్మి, గీత, సునీత పాల్గొన్నారు.

కాంప్లెక్స్ పోటీల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని చింకపాలెం జెడ్పి ఉన్నత పాఠశాలలో ఈ నెల 12న జరిగిన కాంప్లెక్స్ స్థాయి జంప్ పోటీలో ముత్తుపల్లి పాఠశాల 4వ తరగతి విద్యార్థి మైలా మోహిత్ యాదవ్ ప్రథమ స్థానంలో నిలిచాడు. చింకపాలెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం యాకూబ్ బహుమతి, ప్రశంస పత్రం అందజేశారు. జనసేన మండల అధ్యక్షులు మైలా నరేష్ యాదవ్, జి పుల్లారావు, మరకవారిపాలెం పాఠశాల హెచ్ఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

వర్షాలతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఖరీఫ్ సీజన్లో రైతుల సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కంకి దశలో ఉండి గింజ పాలు పోసుకుంటున్న తరుణంలో కురుస్తున్న వర్షాలకు వరిపైరు నేల వాలిపోతుంది. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే దశలో వర్షాల వల్ల నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పైరు నేల వాలింది. గింజ పూర్తిగా పాలు పోసుకోక ముందే పైరు నేల వాలితే గింజ తాలుగా మారే ప్రమాదం ఉందని, సుంకు రాలిపోయి మానుగాయ ఏర్పడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో పైరు నీట మునిగి పూర్తిగా దెబ్బతినగా ఉన్న పంట పొలం పండి చేతికందే సమ యంలో వర్షాలు కురవడం రైతులను మరింత కలవరానికి గురిచేస్తుంది. గత ఐదేళ్ళగా ప్రతి ఏట వరి పైరు చేతికందే సమయానికి ప్రకృతి విలయతాండవం చేసి రైతులను నష్టపరుస్తుందని ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. బాగా పండాయని అనుకుంటున్న సమయంలో వర్షాలు పూర్తిగా చేతికందుతుందో లేదోనని భయోదోళనకు గురవుతున్నారు.


కనకయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

సిపిఐ నాయకులు కనకయ్య మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సిపిఐ సీనియర్ సభ్యులు బట్టు కనకయ్య (95) మండలంలోని ఐలవరంలో గురువారం ఉదయం మృతి చెందారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి నాగాంజనేయులు, వేమూరు కార్యదర్శి బందారు శ్రీనివాసరావు, రేపల్లె కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీలు మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కనకయ్య భౌతిక కాయంపై నాగాంజనేయులు అరుణ పతాకాన్ని కప్పగా జోహార్లు అర్పించారు. ఏడు దశాబ్దాలుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారని అన్నారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. సిపిఎం నాయకులు డొక్కుపర్తి రామారావు, దీపాల సత్యనారాయణ, సిపిఐ (ఎంఎల్) నాయకులు మద్రివాడ వెంకటరావు, దొంతు శ్రీనివాసరావు, కె సీతారామయ్య, ఏఐటియుసి నాయకులు వి శ్రీనివాసరావు నివాళి అర్పించారు.

సచివాలయం పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండమూరు సచివాలయాన్ని ఎంపిడిఒ కె స్వరూపరాణి గురువారం సందర్శించారు. హౌస్ ఓల్డ్ జియో టాకింగ్ సర్వేను ఆమె పరిశీలించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరుకు తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. ఆమె వెంట ఈఓఆర్డి సుమంత్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆదరణ

ప్రజాశక్తి - అద్దంకి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ఆదరణ రాబోతున్నదని, నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలందరికీ అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోగ్య, పోషక వింగ్ ఏపి సిఎన్ఎఫ్ అధికారిణి లక్ష్మి దుర్గ అన్నారు. ఢిల్లీ నుండి వచ్చిన కంపెనీ ప్రతినిధులు శివమ్ దుబే, ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ, ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి గోవాడలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న నరిశెట్టి రమేష్ బాబు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని, ఉపయోగాలు అడిగి తెలుసుకున్నారు. రమేష్ బాబు వ్యవసాయ క్షేత్రంలో పది రకాల దేశీయ వరి రకాలను సాగు చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు అందరు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, విద్యతో మాత్రమే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని బిఎస్పి రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి అన్నారు. స్థానిక బిఎస్పీ కార్యాలయంలో కేర్ వాలంటీర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ దాసు ఆధ్వర్యంలో పిల్లలు, తల్లి, దండ్రులకు చదువుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయనతోపాటు సరళ కుమారి, డాక్టర్ జగన్ మోహన్, మార్క్ మాట్లాడారు. పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని చెప్పారు. పేదల నివాసాల ప్రాంతాలోల్ల ట్యూషన్ నిర్వహిస్తూ పిల్లలను చదువులపట్ల ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మహేశ్వరీ, రత్న కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి

శుక్రవారం 15 నవంబర్ 2024

బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాలలంతా పాఠశాలల్లోనే ఉండాలని, వారి హక్కులు పరిరక్షించాలని కలెక్టర్ జె వెంకట మురళి కోరారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తొలుత బాల సదన్ వద్ద ఏర్పాటు చేసిన చాచా నెహ్రూ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ బాల సదన్ నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు సాగింది. అనంతరం పాత బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. బాలలకు విద్యానందించే బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. విద్య హక్కు చట్టం అమలులో భాగంగా చిన్నారులందరికీ ఉచిత విద్య అందించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలలు ఎదిగే అవకాశాలు కల్పించాలన్నారు. బాలలను పనికి పంపవద్దని, బడి ఈడు పిల్లలు బడి వెలుపల ఉండరాదన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, డీఈఓ పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఆర్డిఓ పి గ్లోరియా, కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ సలీమా పాల్గొన్నారు.

బాపట్ల : విద్యార్థినీ, విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఈఓ ఎస్ నిరంజన్ అన్నారు. శివాజీ గణేషన్, పిసి సాయి బాబు, జి వెంకటేశ్వర్లు, ఎ మల్లికార్జున్, ఉపేంద్ర, ఎం నరసింహారావు పాల్గొన్నారు.

అద్దంకి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పసుపులేటి ఆంజనేయులు, అంజాద్ భాషా పాల్గొన్నారు. ఎన్టీఆర్ కాలనీలో పాఠశాల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం కోట అంజమ్మ పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ జె వెంకట మురళి

నిజాంపట్నం : గ్రంథాలయంలో ఎన్ విజయలక్ష్మి నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

కొల్లూరు : గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవంలో జడ్పిటిసి సభ్యులు చొప్పర సుబ్బారావు, టిడిపి అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, వైస్ సర్పంచ్ ధూళిపూడి కృష్ణ, కనపర్తి మోహనరావు మాట్లాడారు.

వేటపాలెం : రామనగర్ వివేక హై స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హై స్కూల్ కరస్పాండెంట్ వి సుబ్బారావు, వి రాజశేఖర్, పి కృష్ణారావు పాల్గొన్నారు.

చీరాల : గ్రంధాలయాలు ఎంతో ఉపయోగమని ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వర రావు అన్నారు. విఆర్ఎస్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్, చంద్రమౌళి, శ్రీదర్, తడవర్తి చంద్రశేఖర్, ఇమ్మానియేలు, సుబ్బరామయ్య, హరిప్రసాద్, మునిరుల్లాఖాన్, ఎం నాగసునీతా, రాణిమ్మ, పిచ్చయ్యాచార్యులు, కె రాణి పాల్గొన్నారు.

పర్చూరు : బాలల దినోత్సవం సందర్భంగా రూ.6వేల విలువైన బహుమతులు రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అందజేశారు.

ఇంకొల్లు : అంగన్‌వాడీ కార్యకర్త కర్రీ లత మాట్లాడుతూ నెహ్రూకు చిన్న పిల్లలంటే ఇష్టమని అన్నారు.

బట్టిప్రోలు : స్థానిక మాటూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచి ధారా రవికిరణమయి ప్రారంభించారు. బొలిశెట్టి శ్రీనివాసరావు, కలపాల సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. ఐలవరం హెచ్డి పాఠశాలలో ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో నెహ్రూకు నివాళి అర్పించారు.

కొల్లూరు : అనంతవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గుంటూరు వైద్యశాల మాజీ ప్రిన్సిపాల్ గుంటుపల్లి సుబ్బారావు, గైనకాలజిస్ట్ గుంటుపల్లి పుష్పలత, దాతలు దొప్పలపూడి నాగేశ్వరరావు పాఠశాలకు కంప్యూటర్ అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బోనిగల సుబ్బారావు, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపల్లె : పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ పాఠశాల్లో విద్యార్థులకు వివిధ హాస్య క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

సంతమాగులూరు : గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ జయంతి నిర్వహించారు. గ్రంధపాలకుడు బాదం విజయభాస్కరరెడ్డి, ఎంపిపి వై ఎలమంద, సర్పంచి పుచ్చకాయల నాగేశ్వరరావు, కార్తికేయ విద్యా సంస్థల అధిపతి పివై శివారెడ్డి, బండి శివారెడ్డి, ఎండి అల్తాఫ్ పాల్గొన్నారు.

పంగులూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బత్తుల వారి వీధిలోని నెహ్రూ విగ్రహానికి పూలమాల వేశారు. నాగాలాండ్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ మాట్లాడారు.

కార్తీక పౌర్ణమికి తీరంలో భద్రతా చర్యలు

జిల్లా వ్యాప్తంగా 400 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు : జిల్లా ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తగిన భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. స్థానికంగానే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి సూర్యలంక, రామాపురం, ఓడరేవు, నిజాంపట్నం ఇతర సముద్ర తీర ప్రాంతాలు , కష్ణానది తీర ప్రాంతాలలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఆవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 400 మంది పోలీసులతో ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు పుణ్య స్థానాలు ఆచరించే సమయాలలో ఎక్కువ లోతులోకి వెళ్ళి ప్రమాదాలకు గురికాకుండా నిర్దిష్ట లోతును గుర్తించి అక్కడ జెండాలను ఏర్పాటు చేసి, స్థానిక జాలర్ల సాహయంతో పోలీస్ అధికారులు సిబ్బందితో పడవలలో గస్తీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తీరం వెంబడి లైఫ్ జాకెట్లు, రోప్ లను ధరించిన పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. పిల్లలను పుణ్యస్నానాలు ఆచరించడానికి తీసుకుని వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతంలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

నిజాంపట్నం : కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ అన్నారు. హార్బర్ సముద్ర బీచ్‌ను ఎస్ఐ కె తిరుపతిరావు, తహశీల్దారు షాకీర్ పాషాతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. గజీతగాళ్లను ఏర్పాటు చేసి బద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

చీరాల : కార్తీక పౌర్ణమి సందర్భంగా చీరాల తీర ప్రాంతంలోని బీచ్‌లను గురువారం పరిశీలించారు. డిఎస్పీ మొయిన్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో భక్తులకు కావలసిన వసతుల గురించి రెవెన్యూ సిబ్బందితో చర్చించి భక్తుల సంరక్షణ గురించి గజ ఈతగాళ్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రిసార్ట్స్ యజమానులతో మీటింగ్ ఏర్పాటు చేసి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చర్చించారు. సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఈపూరుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న పోలీలసు అధికారులు

గురుకుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - నిజాంపట్నం

మహాత్మ జ్యోతి బాపులే బీసీ (బాలురు) గురుకుల పాఠశాలను గురువారం జిల్లా అధికారులు సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించారు. తాగు, వాడుక నీటి సమస్య ఉందని, మురుగు నీరు పారుదలకు డ్రైనేజీ వ్యవస్థ లేదని ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు అధికారులకు వివరించారు. అధికారులు స్పందిస్తూ విద్యార్థులు వాడుకునే నీటిని స్టోర్ చేసేందుకు పాఠశాల ఆవరణలో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడతామని తెలిపారు. తాగేందుకు మంచినీటి ఆర్వో ప్లాంటుకు బయట నుంచి నీటి పైపు లైన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. డ్రైనేజీ పూడికతీత పనులను చేపట్టి మురుగు నీరు బయటకు పోయేలా మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిపిఒ కెఎల్ ప్రభాకరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ దేబోరా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ శంకర్ బాబు, ఇరిగేషన్, డ్రైనేజీ ఎస్సీ పి వెంకటరత్నం, ఎంపిడిఓ ఎన్ నాగలక్ష్మి, తహశీల్దారు షాకీర్ పాషా, ఈఓపిఆర్డి రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యువతను మరలా కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు విమర్శించారు. యువజన కాంగ్రెస్ ద్వారా కాంగ్రెస్ బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఆయన బుధవారం ఒంగోలు వచ్చారు. స్థానిక డిసిసి కార్యాలయంలో జరిగిన ప్రకాశం జిల్లాలోని యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ సమన్వయకర్త బి ఆర్ గౌస్ అధ్యక్షత వహించారు. బిఆర్ గౌస్ మాట్లాడుతూ 2014లో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని గద్దెనెక్కిన మోడీ సర్కార్ 10ఏళ్లలో ఒక ఉద్యోగం ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగ అవకాశాలను నీరుగార్చిందన్నారు. గత ఎన్నికలలో యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాటలే మరచిపోయి ప్రవర్తిస్తుందన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ బలోపేతం చేసి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇన్‌చార్జి మమతా నాగిరెడ్డి మాట్లాడుతూ నౌకరీదో నషా నహి, శక్తి స్త్రీ అభియాన్ కార్యక్రమాల ద్వారా యువతకు మత్తు పదార్థాలనపై అవగాహన కల్పించి ఉద్యోగ కల్పనకై పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, దాసరి రవి, కైపు వెంకట కష్ణారెడ్డి, పాలపర్తి విజేష్ రాజ్, ఎస్‌కె రసూల్, తెల్లగలపూడి బుజ్జి, సౌమ్య, గిద్యోన్, గుత్తి రాజు, ప్రసాద్, కల్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో యువజన కాంగ్రెస్ నేతలు

దిగి వచ్చిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి చేసేందుకు అధికారులు అంగీకరించడంతో పందిళ్ళపల్లికి చెందిన చెరుకూరి రాంబాబు దీక్ష విరమించాడు. కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశాల మేరకు డిఎం అండ్ హెచ్ఓ విజయమ్మ దీక్షా శిబిరం వద్దకు వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ చేయించారు. అతని దీక్షలకు ప్రజాసంఘాలు మద్దతు తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఎంటి కృష్ణబాబుకు సమస్య వివరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ త్వరితగతిన పందిళ్ళపల్లి వైద్యశాల పునర్నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జై కుమార్, మాజీ ఉప సర్పంచ్ పోలకం చంద్రశేఖర్, గుమ్మడి సుశీల, దండ దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.

సైనిక్ శిక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇడుపులపాడు ఉన్నత పాఠశాల్లో రెండేళ్లుగా ఎన్సిసిలో శిక్షణలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్సిసి సుబేదార్ బాబు సింగ్ భక్తి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎన్‌సిసి శిక్షణ పొందిన విద్యార్థులు మిలటరీలో చేరే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎన్సిసి కేర్ టేకర్ బండారు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్, చెక్‌పోస్టుల పరిశీలన

ప్రజాశక్తి - కొల్లూరు

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్ పోస్టులైన అరవింద వారిది, అనంతవరం, చిలుమూరు వద్ద ఉన్న చెక్ పోస్టులను రేపల్లె ఆర్‌డిఓ రామలక్ష్మి గురువారం పరిశీలించారు. తదనంతరం విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమతంగా ఉండాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా కాకుండా చూడాలని చెప్పారు. ఆమె వెంట తహశీల్దారు బి వెంకటేశ్వర్లు ఉన్నారు.

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ముందస్తుగా నిర్వహించారు. డాక్టర్ అంజలి, భాను ప్రకాష్ రోగులకు స్కాన్‌చేశారు. క్యాన్సర్ వ్యాధి ఏర్పడక ముందే పరీక్షలు నిర్వహించి గుర్తించి వ్యాధి నివారణకు వైద్యం చేయవచ్చని అన్నారు.

వేటపాలెంలో వర్షం

ప్రజాశక్తి - వేటపాలెం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం పడింది. మధ్యాహ్నం ఒకటిన్నర నుండి ఏకధాటిగా సాయంత్రం 4గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. మండలంలో ఇప్పటివరకు 11.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ ప్రేమ తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో స్థానిక గడియార స్తంభం సెంటర్, ఆర్అండ్‌బి రోడ్డుపై మోకాళ్ళ లోతు నీళ్లు నిలిచిపోయాయి. జెడ్‌పి హై స్కూల్ ప్రాంగణమంతా నీళ్లతో నిండిపోయింది. బిబిహెచ్ కళాశాల నందు ఆటస్థలంలో నీళ్లు నిలిచాయి. సర్వోదయ కాలనీ, సమైక్య నగర్, నాయనపల్లి, పోలేరమ్మ గుడి నుండి పడవ వైపు రైల్వే స్టేషన్ చేరుకునే దారి, విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద రోడ్డుపైనే నీళ్లు నిలిచిపోయాయి.

కుందేరు వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని అక్కయపాలెం కుందేరు వద్ద గురువారం ఉదయం లోడ్తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. పైనున్న విద్యుత్ వైర్లను తప్పించబోయే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని డ్రైవర్ తెలిపారు. ఆ సమయంలో ఇతర వాహనాలేమీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికంగా ఉన్న ఆయిల్ కంపెనీ నుంచి పత్తి గింజల లోడును తీసుకెళ్తుండగా లారీ బోల్తా పడటం పట్ల యాజమాన్యం విచారం వ్యక్తం చేశారు.

మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి..

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతి



వి.శ్రీనివాసరావుకు అర్జీ ఇస్తున్న మేస్త్రీలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థలో ని పారిశుద్ధ్య విభాగంలో గత 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మేస్త్రీలను పనుల్లోకి తీసుకోవాలని సిఐటియు నగర కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం ఒంగోలు వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో దాదాపు 15 సంవత్సరాల నుండి 106 మంది కార్మికులు మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కార్మికులపై రాజకీయ కక్షకి, వేధింపులకి పాల్పడుతున్నారని తెలిపారు. అందులో భాగంగా 106 మంది కార్మికులను విధుల నుంచి తొలగించారని తెలిపారు. దీనికి నిరసనగా 11 రోజులు కార్మికుల నుంచి ఆందోళన చేస్తున్నా నేతలు, అధికారులు పట్టించుకోకపోవడాన్ని తప్పుపట్టారు. గత రెండు మాసాలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగేలా పోరాడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు సిహెచ్ వెంకటేశ్వర్లు, గోపి, అజయ్, సాయి, దస్తగిరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సిఐటియు మద్దతు

ఒంగోలు నగరపాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలుగా ఉన్న వారిని కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరావు డిమాండ్ చేశారు. తమ సమస్య పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద గత 11 రోజులుగా యూనియన్ ఆధ్వర్యంలో మేస్త్రీలు ఆందోళన చేస్తున్నారు. మేస్త్రీలు చేస్తున్న నిరసన కార్యక్రమం వద్దకు గురువారం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరావు వచ్చారు. మేస్త్రీలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించారు. మేస్త్రీలను ఉద్దేశించి మాట్లాడారు. మేస్త్రీలను మేస్త్రిలుగానే కొనసాగించాలని కోరారు. ఇందుకోసం 11 రోజులుగా కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడాన్ని తప్పుపట్టారు. మేస్త్రీలపై రాజకీయ కక్ష సాధింపు అనేది సరైనది కాదన్నారు. వారిని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, వారికి గత నెల వేతనం ఇవ్వాలని, మస్టర్ వేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మేస్త్రీలు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. మేస్త్రీల చేస్తున్న పోరాటానికి తమ వంతు మద్దతు ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులపై, స్కీం వర్కర్స్ పై ఇలాంటి వేధింపులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌర అధ్యక్షులు టి మహేష్, నాయకులు సిహెచ్ వెంకటేశ్వర్లు, కే ఆదినారాయణ, విజయ్, వెంకట్రావు, బి మనోహర్ గోపి తదితరులు పాల్గొన్నారు

పంట మద్దతు ధరలకు

చట్టబద్ధత కల్పించాల్సిందే..

- డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి
- 26న మహాధర్నాను జయప్రదం చేయండి
- ఎస్‌కెఎం రాష్ట్ర అధ్యక్షులు వడ్డే శోభనాధీశ్వరావు పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో అన్నదాతలు పండిస్తున్న పంటలకు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధ ఎంఎస్‌పి ప్రకటించాలని మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వడ్డే శోభనాదీశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ ఎన్నికలను దష్టిలో పెట్టుకొని ప్రధాని మోడీ దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను బేషరతుగా వెనక్కి తీసుకోవడమే కాకుండా, దేశ రైతులకు క్షమాపణలు చెప్పారన్నారు. ఎన్నికల అనంతరం ప్రధాని మోడీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 500 జిల్లాలలో పెద్ద ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పట్టణ పేదలు, కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాలు యావన్మంది సమీకతమై కలెక్టర్ కార్యాలయాలు వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు, మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలుల కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాలో జిల్లాలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పట్టణ పేదలు, కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాలు నేతలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్, చుండూరి రంగారావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో పేర్కొన్న విధంగా ఉన్నత వర్గాల నుండి పన్నులు రాబట్టి సాధారణ ప్రజానీకానికి నాణ్యమైన విద్య, వైద్యం అందజేయటమే రాజ్యాంగ లక్ష్యమన్నారు. మోడీ ప్రభుత్వం వీటికి తిలోదకాలు ఇచ్చి పేదప్రజల పొట్టకొట్టి సంపన్నులకు దోచిపెడుతుందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే ప్రభుత్వాల మెడలు ఉంచి దేశంలోని రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధర పొందవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధ భూ సేకరణ చట్టం విరమించుకోవాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పాల డెయిరీని అమూల్ కబంధహస్తాల నుండి బయటకు తేవాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఇస్తున్నట్లు లీటర్‌కు రూ.5 సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ కౌలు రైతుల చట్టంలో భూయజమాని సంతకం ఉండాలన్న నిబంధనను తొలగించాలన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, నల్లమడ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఏఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పరిటాల కోటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోడూరి నాంచార్లు మాట్లాడారు. సమావేశంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకరరావు, విప్లవరైతు సంఘం జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పద్మ ఐద్వా జిల్లా కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు జుజ్జూరి జయంతిబాబు, పెంట్యాల హనుమంతరావు, ఎస్‌డి సర్ధార్, ఉబ్బా కోటేశ్వరరావు, శ్రీరామ శ్రీనివాసరావు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ నాయకులు మండవ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు, రైతుకూలీ, కార్మిక ఉద్యమానికి సాంస్కృతికపరంగా కళాకారులను కదిలించి, ప్రజలు చైతన్యవంతం చేసి 26న జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు తమ శాయశక్తులుగా తమవంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆహ్లాదకర వాతావరణంలో పెరిగే..

స్వేచ్ఛను ప్రతి బిడ్డకూ కల్పించాలి

- అది సమాజంలోని అన్ని వర్గాల ప్రజల బాధ్యత
- బంగారు బాలోత్సవాలు ప్రారంభించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆహ్లాదకరమైన వాతావరణంలో పెరిగి తమ కలలను సాకారం చేసుకునే స్వేచ్ఛను ప్రతి బిడ్డకూ కల్పించాల్సిన బాధ్యత సమాజంలోని అన్ని వర్గాల ప్రజలపై ఉందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తన మానసపుత్రిక 'బంగారు బాల్యం' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించే బంగారు బాలోత్సవాలను గురువారం ప్రకాశం భవనంలో ఆమె ప్రారంభించారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామ్‌బాబు, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ వి.రామాంజనేయులు, డిఆర్ఓ బి.చినఓబులేసు, ఐసిడిఎస్ పీడీ కె.మాధురితో కలిసి కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. బాలల స్వేచ్ఛకు ప్రతీకగా చిన్నారులతో బెలూన్లను గాలిలోకి ఎగురవేయించారు.

'మూడో తరగతిలోనే ఐఎఎస్ అవుతానన్నా..'

భవిష్యత్తులో ఏ స్థాయిలో ఉండాలో చిన్నప్పుడే బాలల్లో ఆశ కలిగించి అందుకు అవసరమైన సహాయం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, టీచర్లపై ఉందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. తాను మూడో తరగతిలో ఉన్నప్పుడు తమ పాఠశాలలో జరిగిన చిల్డ్రన్స్ డే వేడుకలలో పెద్దయ్యాక ఏమవుతావని విద్యార్థులందరినీ టీచర్లు అడిగినప్పుడు ఐఏఎస్ అవుతానని తాను సమాధానం చెప్పినట్లు కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డనూ కనీసం 18 ఏళ్లు పూర్తయ్యే వరకైనా చదివించాలని తల్లిదండ్రులను కోరారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ వి.రామాంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్ఓ బి.చినఓబులేసు, బంగారు బాల్యం నోడల్ ఆఫీసర్ ఎం. వెంకటేశ్వరరావు, డిఈఓ కిరణ్ కుమార్, డిప్యూటీ డి.ఈ.ఓ. సామా సుబ్బారావు, జడ్పీ సిఈఓ బి.చిరంజీవి, డి.ఎం,హెచ్ఓ డాక్టర్ డి.సురేష్ కుమార్, ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, డిఆర్‌డిఏ, మెప్మా పీడీలు టి.వసుంధర, టి.రవికుమార్, బి.సి. సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి నారాయణ, వికలాంగులు సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, డిసిపిఓ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

పోసానిపై పోలీసులకు ఫిర్యాదు



సిఐకి ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-చీరాల

వైసిపి నాయకుడు, సినీనటుడు పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేయాలంటూ చీరాల గడియార స్తంభం సెంటర్లో జగన్, పోసాని కృష్ణ మురళి ఫ్లకార్డులతో కూటమి నేతలు నినాదాలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బి.ఆర్‌నాయుడుపై అనుచితవ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణమురళిని అరెస్ట్ చేయాలని టిడిపి నాయకులు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అనంతరం వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ రెడ్డి పాలనలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను దుర్భాషలాడిన పోసాని కృష్ణ మురళిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివారెడ్డి మూర్తి, గుమ్మ వెంకటేశ్వర్లు, నరాల తిరుపతిరాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వరి సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-చీరాల

మండలంలోని దేవినూతల గ్రామంలో ప్లాంట్ క్లినిక్‌పై వరి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల ఏరువాక కేంద్రం సైంటిస్టులు అయిన డాక్టర్ ఎంసీ డాట్ కోఆర్డినేటర్ మురళీధర్ నాయక్ మరియు ఎం.ఉషారాణి పాల్గొని ఖరీఫ్ సీజన్లో వరివేసినటువంటి వరి రైతులకు ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెట్ట పరిస్థితుల్లో ఉల్లికోడు మరియు అగ్గి తెగులు వస్తుందని చెప్పారు. రైతులు పొలంలో ఉన్నటువంటి దుబ్బులను పీకి మరీ చూపించారు. అంతేకాకుండా రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్న కుమార్ మాట్లాడుతూ రిలయన్స్ ఫౌండేషన్ చేస్తున్నటువంటి బాపట్ల జిల్లాలోని సేవలను చెప్పటం జరిగింది. రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 18004198800 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మరియు విలేజ్ అసిస్టెంట్ అయినటువంటి సఫియా మరియు హదాస్య గ్రామస్తులు పాల్గొన్నారు.